క్లుప్తంగా

ముగిసిన 'డబుల్' వినతుల స్వీకరణ

ఎల్లారెడ్డి: డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులలో తిరస్కరించిన వాటికి సంబంధించి వినతుల ప్రక్రియ ఆదివారంతో ముగిసినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మొత్తం 232 వినతులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ సూచించారు. కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు, దోపిడీలను అరికట్టడానికి ఆస్కారం ఉంటుందన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): వెల్గనూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఆదివారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్ గౌడ్ చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అంజనాద్రి అభివృద్ధికి కృషి చేయాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్): అంజనాద్రి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆదివారం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దఫేదార్ రాజును ఆలయ నిర్మాణ కర్త పట్లోళ్ల కిశోర్‌కుమార్ కోరారు. బ్రాహ్మణపల్లి గేటు వద్ద నాందేడ్-సంగారెడ్డి జాతీయ రహదారి ప్రక్కన ఉన్న అంజనాద్రి ఆలయం గురించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా గుర్తింపు వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా అంజనాద్రి జ్ఞాపికను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, కమ్మరికత్త అంజయ్య, సంఘమేశ్వర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ

నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ కార్యకర్త మహమ్మద్ షఫీని ఆదివారం ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు పరామర్శించారు. చికిత్స పొందుతున్న కార్యకర్తకు ధైర్యం చెప్పారు.

'ప్రతీ మతానికి గురువుంటాడు'

మాచారెడ్డి: ప్రతీ మతంతో పాటు ప్రతీ వ్యక్తికి ఒక గురువుంటాడని శ్రీరామకోటి జప లిఖిత ప్రచారకుడు కృష్ణానంద స్వామి అన్నారు. ఆదివారం భవానీపేటలో నిర్వహించిన శ్రీరామ కోటి జపలిఖిత యజ్ఞంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎలా గురువుంటాడో, ప్రతీ మనిషికీ ఒక గురువుంటాడని, ఆ గురువు బోధనలతో పైకి ఎదగాలని సూచించారు. శ్రీరామునికి వశిష్టముని, కృష్ణునికి సాందీపముని, అర్జునుడికి శ్రీకృష్ణుడు గురువని ఆయన బోధించారు. కార్యక్రమంలో మురళి మహరాజు, శాంతానంద, పూర్ణానంద స్వాములు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నచ్చకే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నా'



కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకే రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నాయకుడు చందు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం రంగాలను ఆగం చేస్తుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్, స్థానిక ప్రభుత్వ విప్ తీసుకుంటున్న నిర్ణయాలు నచ్చకనే నేడు కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలతో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. చందు గతంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

ఇంటింటికి తెలుగు దేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల, సంతాయిపేట గ్రామాలలో ఆదివారం తెలుగు దేశం నాయకులు ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగుర వేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ.. తెలుగుదేశం హయాంలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. నాయకులు మహేష్, లక్ష్మణ్, పురుషోత్తం, సాయిలు పాల్గొన్నారు.

'బండి'పై పోలీసులకు ఫిర్యాదు

నస్రుల్లాబాద్/లింగంపేట/నాగిరెడ్డిపేట/పిట్లం: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్లలో పిర్యాదు చేశారు. బండి సంజయ్‌ను అరెస్ట్ చేయకపోతే తాము ఆందోళనలు చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు పత్రాలను అందజేశారు. పలు చోట్ల బండి సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



నస్రుల్లాబాద్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో..



పిట్లం పోలీస్‌స్టేషన్‌లో..

భూమిలేని పేదలకు మూడెకరాలివ్వాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్, ఇతర నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే మూడెకరాల భూమి ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన రాంపల్లిలో భూమిలేని నిరుపేదలతో మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ భూములు వందల ఎకరాలు భూస్వాముల ఆధీనంలో ఉన్నాయన్నారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని దళిత, గిరిజనులకు పంచాలన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములు గుర్తించి బయటపెడతామన్నారు. ఈ నెల 24న పద్మాజీవాడి ఎక్స్‌రోడ్‌లో ధర్నా, ర్యాలీ చేపడతామన్నారు. భూసమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. కామారెడ్డి చుట్టు పక్కల ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు కార్యాచరణ

కామారెడ్డి అర్బన్: పట్టణంలో మాజీ ఉప ప్రధాని, స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయడానికి కార్యాచరణ ప్రారంభించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. దేశానికి ఎన్నో సేవలు అందించిన స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, అణగారిన వర్గాల నేత జగ్జీవన్‌రామ్ విగ్రహం ఇప్పటికి వరకు కామారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని అన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటుకు కార్యాచరణ కమిటీని ఎన్నుకున్నారు. ఫిరంగి రాజేశ్వర్, వేముల బాల్‌రాం, ఆర్. బాగయ్య, తదితరులు ప్రతినిధులుగా భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తారని జేఏసీ పేర్కొంది.



సమావేశమైన జేఏసీ నాయకులు

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత లక్ష్మీకాంతరావు

నిజాంసాగర్(జుక్కల్): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆ పార్టీ నేత లక్ష్మీకాంతరావు సూచించారు. ఆదివారం జుక్కల్ మండలంలోని వజ్రకండి, సోపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, వినోద్, సంజు, అశోక్ ఉన్నారు.

కొంగరి బాబుది ప్రభుత్వ హత్యే

కామారెడ్డి అర్బన్: బీబీపేట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కొంగరి బాబు జీపీ ఆఫీసులోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన హత్యతో సమానమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బట్టెంకి బాల్‌రాజు ఆరోపించారు. కొంగరి బాబు భార్య గర్భిణీగా ఉందని, జీతం లేక అల్లాడిపోయిన ఆయన తీవ్ర మనస్తాపంతో గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఉరేసుకుని చనిపోయాడని పేర్కొన్నారు. కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించలేని ప్రభుత్వానిదే ఈ హత్యాపాపం అని మండిపడ్డారు. బాబు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, డబుల్‌బెడ్ రూం ఇల్లు, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇవ్వాలని బాల్‌రాజు డిమాండ్ చేశారు.

ఘనంగా ఉర్సు

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లో గుట్టపై వెలసిన ఇబ్రహీం బాషా దర్గా ఉర్సును ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముతవల్లీ వసీయోద్దీన్ ఇంటి నుంచి గంధం, పూలచాదర్, నైవేద్యాన్ని బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. గ్రామస్తులంతా పాడి పంటలతో, సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. గ్రామ సర్పంచ్ మాలెప్ప నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ సాయిలు, నాయకులు పండరి, సాయిలు యాదవ్, విఠల్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

గ్రంథాలయం మంజూరు చేసినందుకు ధన్యవాదాలు

సదాశివనగర్/కామారెడ్డి అర్బన్: మండలంలోని భూంపల్లి గ్రామానికి గ్రామీణ గ్రంథాలయం మంజూరు చేసినందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌ను మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు, పద్మాజివాడి సింగిల్ విండో చైర్మన్ గంగాధర్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరేళ్ల నుంచి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని విన్నవించగా ప్రస్తుత చైర్మన్ మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ దత్తురావు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దేవి సతీశ్, మండలాధ్యక్షుడు సంజీవ్, రవి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న నేతలు

సమాచారం..

నేడు మండల సర్వసభ్య సమావేశం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి మండలంలోని 41 గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.

సిద్ధరామేశ్వరునికి పట్టు వస్త్రాల సమర్పణ

భిక్కనూరు: మండల కేంద్రంలో సిద్ధరామేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం హాజరవుతున్నట్లు ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డిలు ఆదివారం తెలిపారు. ప్రభుత్వ విప్ గోవర్ధన్ హాజరై స్వామివారికి మాత భువనేశ్వరీ దేవిలకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారని చెప్పారు.

15న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 8 గంటలకు కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్ లీగ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌లు తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్ ఎంపికల్లో 16 ఏళ్లు పైబడిన బాలికలు పాల్గొనవచ్చన్నారు. వంద, రెండు, నాలుగు, ఎనిమిది, 1500, 3 వేల మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్, జావిలిన్ విభాగాల్లో ఎంపికలుంటాయని వారు వివరించారు.

16న ముగియనున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ఈ నెల 16న ముగించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఆదివారం తెలిపారు. ఒప్పందం చేసుకున్న రైతులు చెరుకును ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. ఒప్పందం లేని చెరుకు రైతులు వ్యవసాయ అధికారుల వద్ద అనుమతి పత్రాన్ని పొంది క్రషింగ్‌కు తరలించాలన్నారు. ఈ నెల 16 తర్వాత మిగిలిన చెరుకుకు ఫ్యాక్టరీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 4లక్షల 13వేల 498 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

మెహెర్ బాబా వార్షికోత్సవాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కన్‌కల్ గ్రామంలోని అవతార్ మెహెర్ బాబా ఆలయంలో వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు వందలాది ప్రేమికుల మధ్య బాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. 8 గంటలకు సప్త వర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వక్తలు సందేశాలు, ప్రవచనాలు, భజనలు చేశారు. తాడ్వాయి మండలం నుంచే కాకుండా చుట్టు ప్రక్కల మండలాల నుంచి వేల మంది ప్రేమికులు తరలి వచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

యూత్ ఫెస్టివల్‌కు డెయిరీ విద్యార్థుల ఎంపిక

కామారెడ్డి టౌన్: అఖిల భారత యూత్ ఫెస్టివల్ పోటీలకు కామారెడ్డి డెయిరీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు అసోసియేట్ డీన్ శరత్ చంద్ర ఆదివారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు బెంగళూర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే ఆల్ ఇండియా పోటీలకు ఉపన్యాసం, చర్చావేదికల విభాగంలో ఆకాష్, అలాగే చిత్ర లేఖనం, క్లే మోడలింగ్‌లో శతకుమార్‌లు పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల విద్యార్థి వ్యవహారాల అధికారి ఉమాపతి, స్వర్ణలత, రాజగోపాల్, రవీందర్ రెడ్డి తదితరులు అభినందించారు.

సంచార వైద్యం అందక గేదె మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సంచార పశువైద్యం అందకపోవడంతో అడ్లూర్‌ఎల్లారెడ్డిలో ఆదివారం ఒక గేదె మృతి చెందింది. గ్రామంలోని మొసర్ల మహిపాల్ రెడ్డికి చెందిన గేదె అనారోగ్యానికి గురైంది. దీంతో బాధితుడు సంచార పశువైద్యం కోసం 9848581858 ,8008416771లకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పలుమార్లు ఫోన్లు చేసినా వైద్యులు రాలేదన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన గేదె మృతి చెందిందని, నష్ట పరిహారం చెల్లించాలని బాధితుడు డిమాండ్ చేశారు.

గ్రామాల్లో అభివృద్ధికి ప్రాధాన్యం

బాన్సువాడ రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిన్న రాంపూర్‌లో రూ.28 లక్షలతో హనుమాన్ మందిరం మండప నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఇదివరకే రూ.20 లక్షలు, శ్మశానవాటికలో మెటల్ రోడ్డుకు రూ. 3 లక్షలు, ముస్లిం శ్మశానవాటిక ప్రహరీకి రూ.5 లక్షలు, మజిద్‌లో పనులకు రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. మంజూరైన నిధులతో వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. సర్పంచ్ ఈశ్వరీరేఖ, ఉప సర్పంచ్ షేక్ అజీమ్, నాయకులు మోహన్ నాయక్, అంజిరెడ్డి, అంబర్‌సింగ్, ప్రకాష్, అంజయ్య, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యం



యాచారంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే బీఆర్‌ఎస్ లక్ష్యమని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఆదివారం యాచారంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. సర్పంచ్ లత, మోహన్‌నాయక్, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

విప్ చొరవతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు

దోమకొండ: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చొరవతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. బాలుర ఉన్నత పాఠశాలకు రూ.37లక్షలు, పలుగుగడ్డ ఉన్నత పాఠశాలకు రూ.72లక్షలు, బాలికల పాఠశాలకు రూ.49 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్ఆర్ఈజీఎస్ కింద బాలుర పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.9 లక్షలు, బాలికల పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి 6.2లక్షలు విప్ మంజూరు చేసినట్లు వివరించారు. ఎంపీటీసీ సభ్యులు నిమ్మ శంకర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లపు శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు షమ్మీ ఉన్నారు.



దోమకొండలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ సుభిక్షం

- బీఆర్‌ఎస్ యువ నేత గంప శశాంక్

రామారెడ్డి(ఎల్లారెడ్డి): తెలంగాణ రాష్ట్రం బీఆర్‌ఎస్ పాలనలోనే సుభిక్షంగా ఉంటుందని ఆ పార్టీ యువ నేత గంప శశాంక్ వ్యాఖ్యానించారు. ఆదివారం సింగరాయపల్లిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంప శశాంక్ మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం అన్ని మతాలు, కులాల సమ్మేళనమని, దానిని విడదీసి కొందరు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తేలేని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలంగాణ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ అధికం మహేశ్వరీ, ఉప సర్పంచు భానురెడ్డి, వార్డు మెంబర్ బాలకిషన్, మాజీ ఎంపీటీసీ నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గంప శశాంక్‌కు శివాజీ చిత్రపటాన్ని బహూకరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు

ఆధ్యాత్మికం

నర్సింహుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పుట్టు వెంట్రుకలు, పుట్టు ఒల్లెలు, వాహన పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో ప్రభురాంచంద్రం, అర్చకులు నర్సింహచార్యులు, శ్రీనివాసాచార్యులు, పరంధామాచార్యులు, సంజీవాచార్యులు ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



భిక్కనూరు: మండల కేంద్రంలో సిద్ధరామేశ్వరాలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎడ్ల బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పోత లింగమయ్య పండుగ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్‌లో పోత లింగమయ్య పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పోతలింగమయ్య గద్దెను కట్టి, బొడ్డు రాయిని ఏర్పాటు చేసి పోతరాజుల సమక్షంలో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు, గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

శబరి మాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో ప్రత్యేక భజనలు చేశారు. శబరి మాత ప్రతిమ, దివ్య సమాధులను వివిధ రకాల పూలతో అలంకరించారు. రెండో శనివారం కావడంతో భక్తులు భారీగా తరలి వచ్చి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. భజన కార్యక్రమం శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగింది.